# కన్యారత్నాలు

కుసుమ, పద్మావతి కూతురు కాకపోయినా ఆమెనే అమ్మా అని పిలుస్తుంది. ఏడాది వయసున తల్లి పద్మావతిచేతిలో కుసుమనుపెట్టి "అక్కా ! నీకు పిల్లలు లేరు. ఇకనుంచీ దీనికి తల్లిఉండదు. నీవు దీన్ని పెంచి పెద్దదాన్నిచెయ్యి. నీ పిల్లమాదిరిగానే పెంచి పెళ్ళిచెయ్యి. దీనికి కొంతడబ్బూ నగలూ బ్యాంకులో పెట్టాను. పెంచి ఆ డబ్బుతో పెళ్ళిచేసి ఆ నగలుపెట్టు. దీన్ని నీవు ఊరికే పెంచకు. ఇదిగో డబ్బు, తీసుకో"మని చేతిలో పెట్టింది.

కుసుమతల్లికి క్షయవ్యాధి. భర్తపోయినతరువాత ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేసింది. ఊపిరితిత్తులనిండా చిల్లులు పడ్డాయి. ఆపరేషనుచేసినా రక్తం కక్కుతునే ఉంది. అప్పటివరకూ ఉన్న ఆశ అంతరించింది. అక్కచేతిలో బిడ్డనుపెట్టి కన్నుమూసింది.

అప్పటికి కుసుమకు మాటలు బాగా రాలేదు. నాలుగురోజులు పద్మావతిని కొత్తగాచూసి ఏడ్చింది. ఆ తరువాత ఆమే తల్లి అనుకుని అమ్మాఅని పిలవటం మొదలుపెట్టింది.

కుసుమను పద్మావతి టీచరుకనుక తను పనిచేసే స్కూల్లోనే చదివించటం మొదలు పెట్టింది.

కుసుమ మెట్రిక్ పరీక్షకాగానే పెళ్ళిచెయ్యాలని తలపెట్టింది. కాని తగిన సంబంధం కుదరక, కుదిరినా అందుబాటులోలేక జాప్యం జరుగుతూ వచ్చింది.

కుసుమ సహజంగా చురుకైనపిల్ల. కాలేజిలో ప్రవేశించి పట్టభద్ర అయింది. సంగీతంలో డిప్లొమా డిగ్రీ సంపాదించింది.

బుద్ధి తెలిసినపిల్ల. తనకు వచ్చిన సంబంధాలు ఒక్కటీ కుదరటంలేదు. తల్లికి బాధ్యతనిపించకుండా ట్యూషన్లుచెప్పి ఆమెచేతిలో డబ్బుపెట్టేది.

కుసుమకు పెళ్ళిచేసి తనకు చెల్లెలు ఒప్పగించిన బాధ్యతను నిర్వర్తించి ఆమెను ఒక యింటిదాన్ని చెయ్యాలని పద్మావతి సకల ప్రయత్నాలు చేస్తున్నది.

కాని - పెళ్ళి సంబంధం కుదరటంలేదు.

కుసుమ ఒకనాడు ఇంటికి వచ్చేసరికి పద్మావతి భర్తతో ఘర్షణ పడుతున్నది. ఇది తనను గురించేనని కుసుమ గ్రహించింది అందులో పద్మావతి భర్త అన్నమాటలు కొన్ని అర్థమయ్యాయి. "ఆపిల్ల నీకు పుట్టిన కూతురా? ఎందుకీఆరాటం నీకు ? పెళ్ళి అయినప్పుడు అవుతుంది'' అన్నమాటలు కుసుమను ఆలోచనలోకి దింపాయి.

ఒకనాడు సాయంత్రపువేళ కాఫీ తాగే సమయంలో ''అమ్మా కలిసివస్తే పెళ్ళిచేసేదానివి. కలిసిరానిదానికోసం ఆరాటపడటం దేనికి ? నీవు ఇంక పెళ్ళి ప్రయత్నాలు మానుకో. నేనింకా పైచదువులు చదవాలనుకుంటున్నాను. నిన్నటితో ట్రైనింగయిపోయింది. నేను ఎం. ఏ. చేద్దామనుకుంటున్నాను. ఇక్కడలేదు. కనుక ఆ కాలేజి ఉన్న ఊరికి వెళ్ళి చదువుతాను" అన్నది కుసుమ.

"ఎం. ఏ చదవాలనీ ఇక్కడినుంచి వెళ్ళాలనీ ఎందుకు నిశ్చయించుకున్నావమ్మా ? ఇక్కడ నీకు కావాలంటే ఉద్యోగం దొరకదా ? ఇక్కడా ఖాళీలు ఉంటాయి'' అన్నది కుసుమ మాటలకు ఆశ్చర్యపోతూ.

' అమ్మా నీవు తెలియని దానవా ? చదివే ఈడులో చదివితే ఆ చదువు సాగుతుంది. నీవు అలా చదవలేకపోబట్టేకదా స్కూల్లోనే పనిచేస్తున్నావు ? నన్ను వెళ్ళనీ. ఆ అనుభవంకూడా కానీ'' అంది.

"అయితే పెళ్ళి ? ఎవరయినా వచ్చి పెళ్ళికూతుర్ని చూస్తానంటే ?''

''నేను వెళ్ళి నీకు నా ఎడ్రసు రాస్తాను. టెలిగ్రాము ఇచ్చినా వస్తాను. నీమాట నేను ఎప్పుడు వినలేదు చెప్పు ? నన్ను దీవించి పంపు నాకు శుభంకలగాలని" అని గడ్డం పట్టుకుని బ్రతిమిలాడింది.

"సరే నీయిష్టం, కావలసిన బట్టలుకొనుక్కో. అక్కడికి వెళ్ళి డబ్బు కావాలంటే ఉత్తరంరాయి. అన్నట్టు నీకు బట్టలకూ వెళ్ళటానికీ డబ్బు బ్యాంకినుంచి తెస్తానుండు. నీవు మెడలో ఏమీలేకుండా చేతులకు ప్లాస్టిక్ గాజులు

వేసుకుంటున్నావు. మెడలో పూసలదండ వేసుకుంటున్నావు. ఇంతకాలం చిన్న పిల్లవు అలాఉండనీ అని ఊరుకున్నాను. ఇప్పుడు బుద్ధితెలిసిన పిల్లవు అన్ని జాగ్రత్తలు తెలుసుకున్నావు. మెడలోకి ఒకగొలుసు, చేతులకు రెండేసి గాజులూ డబ్బు తీసుకువస్తాను. నన్ను రమ్మంటే బజారుకు నేనూవస్తాను" అన్నది.

'అమ్మ బ్యాంకునుంచి నగలు, డబ్బూ తెస్తానంటుంది. ఎక్కడినుంచి? ఎప్పుడు పెట్టింది బ్యాంకులో? డబ్బు బ్యాంకులో ఉంటే ఇంట్లో నెలాఖరికి అన్నిటికీ ఇబ్బంది పడటం దేనికి? అయినా ఇప్పుడు నేను పెద్దదానిలా అవన్ని అడిగితే బాగుండదు? అనుకుని ''నీవూ రా సెలవు చేద్దువుగాని'' అన్నది.

''రేపు ఉదయమే ఒక గంట సెలవుపెట్టి డబ్బు తీసుకువస్తాను. సాయంత్రం స్కూలునుంచి రాగానే వెళ్దాము'' అన్నది పద్మావతి.

"మనం వచ్చేసరికి ఆలస్యం అవుతుందేమో? నాన్న వస్తారు. పోనీ నేను మా స్నేహితులతో వెళ్ళి తెచ్చుకుంటాలే" అన్నది కుసుమ.

''ఆ మనం ఎంతసేపు వెళ్తామని? అరింటికి ఇంటికి రానేవస్తాము. ఆయన వచ్చేసరికి ఆరున్నరవుతుంది. ఒక్కోసారి ఏడుగంటలవుతుంది. ఆగుతారులే"

"ఏమో? కాఫీ వెంటనే కావలసి వచ్చిందంటే కోపంవస్తుంది. ఆయనకు కోపం తెప్పించటమెందుకు?''

"అఁ. ఆయనకోపంవస్తే అరుస్తారు గాని నీవెంట వచ్చానంటే ఏమనరు. ఆయనకు ఎంతప్రేమో నీవంటే తెలుసా?''

''తెలుసుననుకో - గాని ఆయన సహనానికి పరీక్ష పెడతానంటావా? వద్దు, ఆ పని మాత్రం చెయ్యకులే'' అంది కుసుమ.

మరునాడు వెళ్ళి బట్టలు అవసరమైనవి కొనుక్కొని రెండురోజుల క్రిందట తను పత్రికలో చూసిన ప్రకటనకు వస్తున్నానని టెలిగ్రామ్ ఇచ్చి ఇంటికివచ్చింది. పదిహేను సంవత్సరాల అమ్మాయికి చదువూ, సంగీతమూ ఇంట్లోనే చెప్పగల టీచరు కావాలనీ భోజనవసతీ ఉండటానికి రూమూ ఏర్పాటు చేస్తామని పత్రికలో శ్రీమంతులు, ఎడ్రసుతో కూడా ప్రకటించారు. అదిచూసిన తరువాత కుసుమకు ఒక్కనిమిషమైనా ఆలస్యంచెయ్య బుద్ధికాలేదు. ఆ ప్రకటననుసరించి ఇల్లు వెతుక్కుంటూ వెళ్ళింది.

ఆ భవనమూ - ఆ వైభవమూ చూసి వాళ్లు ఒకప్పుడు జమిందారులై ఉంటారని ఊహించుకుంది. అమ్మాయయితేనేం? ఒక్కతే కనుక గారాబంగా పెంచి ఉంటారని ఊహించుకుంది.

కుసుమను నౌకరు లోపలికి తీసుకువెళ్ళింది. తల్లిపక్కన చీరె చెంగులు కిందివరకూ వేలాడతీసుకుని కూర్చుంది అమ్మాయి. ఆమెకు చదువు చెప్పించాలనీ టీచర్ని ఇంట్లోనే పెట్టుకోవాలనీ జమీందారుగారు అనుకుంటూనే చనిపోయారు. ఆయన చనిపోయిన దుఃఖం కొంత తగ్గిన తరువాత అమ్మాయితల్లి గుమాస్తాతో చెప్పి ప్రకటన చేయించిందట.

''అమ్మాయి ఎక్కడికీ వెళ్లలేదు. ఆమెకు పుట్టుకతోనే కాళ్ళు కురచగా మెలిక తిరిగి ఉన్నాయి. కనుక ఆమెకు తోడుగా ఉండి ప్రేమతో విద్యనేర్పాలి. ఆంగ్లభాష తెలుగుభాష సంగీతమూ మీరు నేర్పించాలి. అమ్మాయి గదిపక్కనే మీకు ఒకగది తగిన సౌకర్యాలతో ఉంటుంది. మీ భోజనం కూడా ఆమెతోనే. మీరు ఆమెకు తగిన కాలక్షేపం కలిగిస్తూ ఆమె తనకున్న లోపాన్నిగురించి బాధ పడకుండా చేయాలి. అయితే మీరు అంతా విన్నారుకదా. జీతమెంత కావాలంటారు చెప్పండి" అన్నదామె. ఆమెపేరు వరలక్ష్మమ్మ. ఆమె తల్లిపేరు వెంకాయమ్మ. ఆమె కూడా కూతురుదగ్గరే ఉంటుంది. ఆమెకూడా కుసుమను పరీక్షగా చూస్తోంది.

''మీరు నాకు కావలసిన వసతులన్నీ కల్పించి మీ అమ్మాయిని ఆప్యాయంగా చూస్తూ విద్య చెప్పమన్నారు. నేనామెను చెల్లెలుగా చూసుకుంటాను. నాకు తోబుట్టువులులేరు. నాకాకొరత తీరుస్తున్నారు. అమ్మదగ్గర బేరమెందుకమ్మా. మీరు ఎంతఇచ్చినాసరే''నన్నది కుసుమ.

అమ్మాయిపేరు కనకమహాలక్ష్మి. పదిహేను సంవత్సరాల పసిడిబొమ్మ. చాలా చురుకైనది. అప్పటికే టీవీలో వచ్చిన పాటలు విని పాడటానికి ప్రయత్నిస్తోంది. ఆమెకొక స్నేహితురాలు లభించినట్లయింది. కుసుమను వదలి పెట్టటంలేదు. ఇంతకుపూర్వం ఆమె నౌకర్లతో మాట్లాడటమేగాని స్నేహితులు లేరు.

కుసుమ ఆమెకు చదువుచెప్పటానికి పుస్తకాలు, సంగీతం చెప్పటానికి శ్రుతిపెట్టె, తెప్పించమని లిస్టురాసిచ్చింది. పుస్తకాలు తెచ్చేవరకూ టీ. వీ.

ముందర కూర్చోబెట్టి ఆ కార్యక్రమాలనన్నిటినీ ఆమెకు అర్థమయేటట్లు వివరించేది.

కనక మహాలక్ష్మి నడవలేదు కనుక పాకుతూ ఉండేది.

కలిగిన కుటుంబంలో పుట్టిన అందమైన తెలివిగలఅమ్మాయి ఇట్లా పాకుతూ ఇల్లంతా తిరుగుతూ ఉంటే కుసుమకే మనసు కలచివేసినట్టుండేది.

ఒకరోజు వరలక్ష్మమ్మతో కృత్రిమమైన అవయవాలను ఈ రోజుల్లో అమరుస్తున్నారు. మీరా ప్రయత్నం చెయ్యలేదా అమ్మా ? బొంబాయి జయపూర్ వంటి ఊళ్ళల్లో అవసరమైన అవయవాలను తయారుచేసే కర్మాగారాలు ఉన్నాయి. సైజునుబట్టి అవయవాలు తయారుచేస్తున్నారు.'' అన్నది కుసుమ.

''నేనుకూడా ఈ సంగతి విన్నాను. కాని - అమ్మాయికి ఆపరేషన్ చేస్తారేమోనని భయంవేసింది. ఇంతచేసినా నడవగలదా అన్న అనుమానం కూడా వచ్చింది" అన్నది.

''నడకవస్తుందమ్మా, వేలాదిమంది చేయించుకుని నడవగలుగుతున్నారు. అలా నడిచిన వాళ్ళను నేను కళ్ళతో చూశాను.'' అన్నది కుసుమ దృఢంగా.

''అంత గట్టిగా చెబుతున్నారు. నాకూ ఒకసారి ప్రయత్నంచేసి చూడాలనే ఉన్నది. కాని - ఇంతవరకూ నేను ఒక్కదాన్ని ఈ ఊరు దాటి వెళ్ళలేదు. మా గుమాస్తాను తోడిస్తాను. నీవు కూడావెళ్ళి ఆ పని చేసుకు వస్తావా ?'' అన్నది వరలక్ష్మమ్మ.

కనకమహాలక్ష్మి పుట్టిననాడు ఆమె ముఖంచూసి అందరూ సంతోషించారు. కాని కాళ్ళు చూడగానే గొల్లుమన్నారు. పాప శరీరానికి తగినట్టుగా కాళ్ళనిర్మాణం జరగలేదు. చాలా కురచగా మెలికతిరిగి ఉన్నాయి. పుట్టగానే డాక్టర్లు చూశారు. "కొంచెం మెలికతిరిగినట్లున్నాయి. అమ్మాయిని పెరగనీయండి. అప్పుడు చూద్దాం" అన్నారు. అమ్మాయి ఐదవఏట తండ్రిచనిపోయారు. అప్పటినుంచీ వరలక్ష్మమ్మ కడుపులో బాధగాఉన్నా ధైర్యంతెచ్చుకుని, ఆమెకోసం ప్రత్యేకంగా మనిషిని పెట్టి తన కంటిపాపలా కాపాడుతున్నది.

పాపకు తల్లీ అమ్మమ్మా కనకమహాలక్ష్మి అని పేరుపెట్టారు. పేరుకు తగినట్టుగా ఉండేది.

మహాలక్ష్మి టీచరుకంటె ముందుగాలేచి స్నానంచేసేది. తలదువ్వుకుని చదువుకునే గదిలోకివచ్చేది. ప్రాతఃకాలంలో సంగీతసాధనచేస్తూ కుసుమకు కనుపించేది. ఆమె శిష్యరికంలో కొత్త కీర్తనలు నేర్చుకున్నది. మొట్టమొదట నేర్చుకున్న భజనలను పాడుతూఉండేది.

ఉదయం ఎనిమిదిగంటలకు సంగీతసాధన తరువాత కాఫ్యాదులు సేవించి, ఆంధ్ర ఆంగ్ల భాషలలో పాఠాలను నేర్చుకునేది. రాయటం చదవటమేకాక-బాగా మాట్లాడటంకూడా నేర్చుకున్నది. ఇలా ఒకటి రెండు మూడు తరగతులు త్వరగా దాటింది.

ఈ విధంగా రెండు సంవత్సరాలు దాటినతరువాత కృత్రిమావయవాలను గురించి వరలక్షమ్మతో మళ్ళీ కుసుమ ప్రస్తావించింది. మొదట తను వెళ్ళి వాటిని అమర్చే విధానాలనుగురించీ రేట్లనుగురించికూడా తెలుసుకుని వస్తానని కుసుమ అంగీకరించింది.

కుసుమ, అమ్మాయికాళ్ళకు ఫోటో తీయించి తీసుకువెళ్ళితే బాగుంటుందని డాక్టరు చెప్పిన మీదట ఫోటోలు తీయించి తీసుకువెళ్ళింది జయపూర్.

అక్కడి డాక్టరు "అమ్మాయిని తీసుకురండి కృత్రిమ పాదాలను అమర్చి నడక నేర్పుతాము. ఈ అవయవాలు అమర్చేటప్పుడు చిన్న ఆపరేషన్ అవసరమవుతుంది అందుకు భయపడ నక్కరలేదు. అవయవాల తయారీకీ, అమర్చటానికీ డాక్టర్‌కి, నడక నేర్పించటానికి వెంటఉన్న నౌకరికీ డబ్బు ఇవ్వాలి. అతడెందుకంటే ఒకకాలిమీద ఎంతసేపునిలబడగలదో చూస్తూనడిపిస్తాడు. ఆపరేషన్ చేసి కాళ్ళు అమర్చిన డాక్టరికి డబ్బు ఇవ్వవలసి ఉంటుంది. ఇది కాక హాస్పిటల్ ఖర్చులుంటాయి." అని మొత్తం ఖర్చురాసి ఇచ్చాడు.

కుసుమ పని కాగానే తిరిగివచ్చి చీటీ వరలక్ష్మమ్మకు చూపించింది.

బయలుదేరటానికి మంచిరోజు చూడాలని అమ్మమ్మ వెంకాయమ్మ అన్నది. వరలక్ష్మమ్మ, వాళ్ళు చెప్పినంత డబ్బుకాక-రైలు ఖర్చులు వెంబడిఉన్న వాళ్ళకు భోజనపుఖర్చులు అదనపుఖర్చులు ఇచ్చి పంపుతూ, "కుసుమా! నా ప్రాణాన్ని నీచేతిలో పెట్టి పంపుతున్నాను. ఏరోజు కబురు ఆరోజు నా కందించాలి" అన్నది నీళ్ళు నిండిన కళ్ళతో.

''ఏం భయంలేదమ్మా. ఎంతో మందికి నా కళ్ళముందర అమర్చారు. చాలామంది నేను చూస్తుండగా నడిచారు. నేను మహాలక్ష్మిని నడిపించి తీసుకు వస్తాను చూడండి.'' అని కుసుమ వరలక్ష్మమ్మకు ధైర్యంచెప్పి గుమాస్తాను వెంట తీసుకుని మహాలక్ష్మితో కూడావెళ్ళింది.

వీళ్ళు వెళ్ళిన మూడోనాటికే మహాలక్ష్మికి కొలతలు తీసుకుని కాళ్ళు తయారు చేశారు. ఆ మరునాడు డాక్టరువచ్చి కృత్రిమపుకాళ్ళు మహాలక్ష్మికి అమర్చాడు. పుండు మానిన తరువాత మెల్లగా రోజుకు పది అడుగులతో ప్రారంభించి అర గంట-గంట-రెండుగంటలలో టెక్నిషియన్ వచ్చి నడిపించేవాడు.

తన కళ్ళముందర నడుస్తున్న మహాలక్ష్మికి ఫోటోతీయించి తల్లికి పంపించింది కుసుమ. ఆమె వెళ్ళినప్పటినుంచి ఏరోజు ప్రొగ్రెసు ఆరోజు జాబువ్రాసేది. డాక్టర్లు చెప్పినదానికంటె పదిహేను రోజులు ఎక్కువేఉండి అందరూ తిరిగి వచ్చారు. మహాలక్ష్మిని నడుస్తుండగా లోపలికి తీసుకువచ్చింది కుసుమ. పెట్టిన కాళ్ళు శరీరానికి ఒత్తుకోకుండా లోపలివైపు స్పంజి రబ్బరువంటివి అమర్చారు. రాత్రిళ్ళు వాటిని తీసి పడుకుంటే మంచిదని తీస్తూఉండేది మహాలక్ష్మి.

వరలక్ష్మమ్మకు చాలా ఆనందంగాఉంది. వెంకాయమ్మ తన కళ్ళతో చూడ లేనేమో ననుకుంది. కాని మహాలక్ష్మిని చూడగానే ఎక్కడలేని సంతోషమూ కలిగింది.

"కుసుమా, విద్యాగంధం ఎరగని నా కూతురిని చదువుల సరస్వతిగా చేశావు. సంగీతంచెప్పి గానకోకిలగా రూపొందించావు. నీ చేత్తో పెళ్ళికూడా చేసి దాని జీవితాన్ని పరిపూర్ణంచెయ్యి. నీవు ఇక్కడికి టీచరుగా వచ్చావు. కాని అమ్మాయిని ఒక చెల్లెలుగా చూసుకున్నావు. చాలా కష్టపడ్డావు. నీ ఋణం ఎలా తీర్చుకోవాలో చెప్పు'' అంటూ లేచివచ్చి కుసుమ రెండుచేతులూ పట్టుకుంది.

''నాదేముందమ్మా. అమ్మాయి తెలివిగలది. చురుకైనది చెప్పిన వెంటనే గ్రహించుకునేది. సంవత్సరానికి రెండు క్లాసులవంతున చదివింది. సంగీతంకూడా అంతే ఒకసారి చెప్పగానే రాగం అందుకునేది. ఆమె దగ్గర ఈ శక్తి లేకపోయి నట్లయితే సంవత్సరాలుపట్టేది.ఇందుకు అమ్మాయికున్న శక్తి సామర్థ్యాలే కారణం నేను అందరికీ చెప్పినట్టే చెప్పాను. మీరు మాత్రం నన్ను ఒక టీచరుగా చూడ

లేదు. అమ్మాయిలా చూసుకున్నారు. నాకు అవసరమైనవాటికంటె అధిక సౌకర్యాలు కల్పించారు. మహాలక్ష్మిని నేను నా చెల్లెలనుకున్నాను. అంతే అంతకంటె నేను చేసిందేమిలేదు.'' అని పెద్దవాళ్ళిద్దరికీ పాదాభివందనం చేసింది.

వరలక్ష్మమ్మ అంతటితో ఊరుకోలేదు. రెండు కొత్తచీరెలు తెప్పించి వాళ్ళిద్దరినీ కట్టుకోమన్నది. ఆరోజు పండగచేసింది.

ఇంటికి వచ్చిన తరువాతకూడా ఒకగంట - రెండుగంటలు రోజుకు నడవటం మహాలక్ష్మి మానలేదు. సంగీతసాధన మామూలుగా సాగిపోతున్నది.

''టీచర్ నేను చదువుకున్నాను గాని ఎంతచదువుకున్నదీ తెలియాలంటే ఒక కొలతబద్ద కావాలి కదా. నన్ను ఏ పరీక్షకయినా పంపించండి. రాస్తాను'' అన్నది ఉత్సాహంతో మహాలక్ష్మి.

"అవును. నీకాలోపం కూడా ఉండకూడదు. చదువుకు కొలతబద్ద డిగ్రీ. అదికూడా అవసరమే. నేను కూడా క్లాసు తరువాత క్లాసు వంతునే చెప్పాను. నీవు ఏ పరీక్షఅయినా ప్రైవేటుగా రాయవచ్చు. మొదట మెట్రిక్ పరీక్ష ఈ సంవత్సరం. రెండేళ్ళాగి ఇంటర్, ఆ తరువాత రెండేళ్ళకు బి. ఏ. నీకు ఇంకా చదవాలని ఉంటే ఎం. ఏ. పరీక్ష ఉంది. తరువాత డాక్టరేటు చెయ్యవచ్చు. నేను గైడ్‌ను చూసి పెడతాను. నీకు చదువుమీద ఇంత ఆసక్తి ఉంటే తప్పకుండా చదువుకో. నేను నీకు అన్నివిధాలా సహాయంచేస్తాను.''

ఆ సంవత్సరమే మెట్రిక్ పరీక్ష రాయించింది కుసుమ.

వీళ్ళిద్దరు చదువులూ డిగ్రీలను గురించి ఆలోచిస్తుంటే వాళ్ళ గదుల్లో కూర్చుని వెంకాయమ్మగారు వరలక్ష్మమ్మ మహాలక్ష్మికి పెళ్ళి ఆలోచనలు చేస్తున్నారు.

''మనం ఉండగానే అమ్మాయికి పెళ్ళిచేసి ఒక యింటిదాన్ని చెయ్యాలి. మన తరువాత దానిని చూసేది ఎవరు ? అయినా ఆడపిల్లకు చదువూ, సంగీతం ఉంటే జీవితానికి పరిపూర్ణత కలగదు. పెళ్ళి ప్రయత్నంచేయవలసిందే" నని నిశ్చయించుకున్నారు.

ఆ మాట కుసుమ చెవిన కూడా వేశారు.

"అమ్మాయిని గౌరవించేవాడు రావాలిగాని ఆమె కుంటిదికదా అని డబ్బు పెత్తనంచేసి ఆమెకు అన్యాయంచేసే వాడితో వివాహం చెయ్యకండి. ఎవరు వచ్చినా ఇప్పుడు డబ్బునుచూసి వస్తారు. ఆమెకు చూసే సంబంధం బాగా లోతుపాతులు విచారించి నిశ్చయం చెయ్యాలి. మీయింట్లో ఉండేవాడు, మంచి వ్యక్తిత్వము గలవాడు, ఆమెను ప్రేమతో చూసుకునేవాడు, కావాలి" ఖండితంగా చెప్పింది కుసుమ.

కుసుమ ఆలోచన వేరుగాఉంది. అమ్మాయిచేత సిలబస్ ప్రకారం చదివించి బి. ఏ. పరీక్షకూడా రాయించింది. రిటైరయిన తెలుగుపండితుడి సహాయంతో మహాలక్ష్మితో పాటు తనుకూడా ఎం. ఏ. పరీక్షరాసింది. ఆ ఊరి కళాశాలలోని రీడర్ని గైడ్‌గా పెట్టుకుని రీసర్చి మొదలుపెట్టారిద్దరూ.

ఊపిరాడకుండా ఇద్దరూ కూడ పలుక్కొని చదువుతూ ఎప్పటికప్పుడు ఆయనకు చూపించి తప్పుఒప్పులను సరిచూసుకుంటూ రెండు సంవత్సరాలు కష్టపడ్డారు. థీసిస్‌లు రాశారు. పట్టాలు తెచ్చుకున్నారు.

మహాలక్ష్మి తండ్రి జమీందార్లందరివలె భోగలాలసుడు కాదు. తనస్థాయికి తగినట్టుగా పండితసభలూ సన్మానాలూ చేసేవాడు. అయన గొప్పపండితుడు. పెద్దగ్రంథాలయం తన యింట్లోనే నెలకొల్పాడు. తీరిక సమయాలలో ఆ గ్రంథాలయంలోని గ్రంథాలు చదువుతూ కాలక్షేపం చేస్తున్నారు మహాలక్ష్మి, కుసుమ.

తల్లీ అమ్మమ్మ ఇద్దరూ పురోహితుడిని పంపి సంబంధాలు వెతికిస్తునే ఉన్నారు. వయసు మీరిపోయిందని లోపల్లోపల భయపడుతునే ఉన్నారు.

కొందరు యువకులు వచ్చి చూసిపోతునే ఉన్నారు. ఎంత చదువున్నా డబ్బున్నా ఆమెకు కుంటిపిల్ల అన్న పేరుపడిపోయింది. వచ్చిన వాళ్ళు వచ్చినట్టే తిరిగి పోతున్నారు.

మహాలక్ష్మి మంచి ఆలోచనా పరురాలు. కుసుమతో ఆలోచించి మరి కొందరు రిటైరయిన ప్రొఫెసర్ల సహాయంతో తండ్రిపేరుమీద ఒక కాలేజి నెలకొల్పాలని నిర్ణయించింది.

"అదే ఉత్తమమైనది. మీ తండ్రిగారి ఋణం తీర్చుకున్నట్లవుతుంది. ఎంతో

మంది ఆడపిల్లలకు విద్యాదానం చేసినట్లవుతుంది. నీవే ప్రిన్సిపల్‌గా ఉండవచ్చు" నని ఆమె ఆలోచనను మెచ్చుకుంది కుసుమ.

వరలక్ష్మమ్మ సంబంధాలు తిరిగిపోతున్నకొద్దీ ఉత్సాహాన్ని కోల్పోతున్నది. ఈ వంశమింతటితో అంతరించిపోతుందేమోనన్న విచారం కలుగుతోంది.

ఈలోపల కుసుమను తోడుచేసుకుని ప్రొఫెసర్ల సహాయంతో కళాశాల స్థాపనకు పూనుకుని తల్లిదగ్గరికి వచ్చింది మహాలక్ష్మి.

"అమ్మా, నీ విచారం నాకు తెలుసు. పెళ్ళిచెయ్యాలని పరితపించిపోతున్నావు. నేను నాన్నగారి పేరుమీద ఒక కళాశాలను ఆడపిల్లలకు నెలకొల్పాలని రిటైరయిన ప్రొఫెసర్లతో ఆలోచనలు చేసి సర్వమూ ఆయత్తం చేశాను. నాన్నగారి పేరుమీద ఎంతోమంది విద్యావంతులవుతారు. నాన్నగారిపేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది. అందుకు నాకు అందరి అండదండలూ లభించాయి. నీ అనుమతీ ఆశీర్వచనమూ కావాలి. మొదలు రెండు సంవత్సరాలు ప్రొఫెసరుగారిని ప్రిన్సిపల్‌గా ఉంచుతాము. తరువాత మాటీచర్ని ఉండమని కోరుతున్నాను. మా యీ ప్రణాళికను ఆమోదించి నన్ను ఆశీర్వదించమ్మా" అని వేడుకుంది కన్నీళ్ళతో.

"అయితే మీటీచరు ఇంక వెళ్ళిపోతారా?" ఆదుర్దాతో అడిగింది వరలక్ష్మమ్మ.

"ఆమె వెళ్ళదు. ఆమెకు మేము చదువుతుండగానే తల్లి పోయిందని టెలిగ్రామ్ వచ్చింది. తండ్రి దేశాలమీద తిరుగుతున్నాడు. ఇప్పుడెక్కడున్నాడో తెలియదు. ఆమె ఉంటేనేగాని నేను ఏపనీ చెయ్యలేను. ఆమె అండదండలు నా జీవితాంతమూ కావాలి.''

మహాలక్ష్మి ఐదేళ్ళ పిల్లగా ఉన్నప్పుడు చిన్న కుర్చీలో కూర్చోబెట్టి తీసిన ఫొటో చూస్తూ "ఈ చిన్న లక్ష్మికి ఎంతగొప్ప ఆలోచనలు వచ్చాయి ? ఎంతెంత పనులు చెయ్యాలని తలపెట్టింది ?" అనుకుని కళ్ళు ఒత్తుకుంటూ "అమ్మాయీ, నాన్నగారి పేరుమీద కాలేజి నీవు నిర్వహిస్తానంటే నేను అభ్యంతరం చెప్తానా ? నీఇష్టంవచ్చినట్లే కానివ్వు. అమ్మమ్మకు కూడా చెప్పు" సంతోషంతో కూతురి చేతులు పట్టుకుంది.

"అమ్మమ్మకు ఇదివరకే చెప్పాను, డబ్బుకూడా ఇచ్చింది. అమ్మా మరో

సంగతి. మా టీచరు ప్రొఫెసరుగారు ఏమన్నారంటే పేరు పెట్టేటప్పుడు "వరలక్ష్మి చెన్నకేశవ కళాశాల" అని ఇద్దరి పేర్లూ కలిపి పెడదామన్నారు. ముందు నీకు చెప్పమన్నారు."

''ఎంత పెద్ద ఆలోచన చేశారు ? ఆయన అసలు నీవు చదువుకుంటావని ఊహించనైనా లేదు. నడుస్తావని కలలో కూడా అనుకోలేదు. నీ అభివృద్ధిని కంటితో చూస్తే ఎంతబాగుండేది?" అంది తడికళ్ళతో.

"అనుకున్నవన్నీ జరుగుతాయా ? ముందీ మాటచెప్పు ? నీకిష్టమే కదూ పేరు ? చెప్పు'' మరొకసారి అడిగింది.

"అమ్మాయీ, పేరు బ్రహ్మాండంగా ఉందని చెప్పు. నాకు చాలాఆనందంగా ఉందని పేరు సూచించినవారికి మరీ మరీ చెప్పు" అన్నది ఆనందాతిరేకంతో.

పెద్దలందరూ కలిసి ప్రారంభోత్సవానికి ముహూర్తం పెట్టించారు. ఊరివారందరు, కళాశాల అధ్యాపకులూ అందరూ కలిసి ప్రారంభోత్సవం చేశారు.

ఇంటికి వచ్చిన తరువాత మహాలక్ష్మి "అమ్మా, ఆఫీసుకు అద్దెకిచ్చిన ఆ పెద్ద బిల్డింగును ఖాళీచెయ్యమని నోటీసు యిచ్చాను. వాళ్లు ఇంకా ఖాళీచెయ్యలేదు. దాన్ని రిపేరుచేయించి సున్నం వేయించాలి. మరొకసారి కబురుచెయ్యనా?'' అడిగింది తల్లిని.

''వాళ్ళు ఖాళీచేశారు. బాగుచెయ్యమని మనుష్యులను పంపించాను. పూర్తిగా బాగుచెయ్యటానికి ఒకవారం కావాలన్నాడు" వరలక్ష్మి అన్నది.

''అయితే ఇంకమేము ఫర్నిచర్‌కి ఆర్డరు ఇస్తాము.''

అన్నిపనులు శుభకార్యం కోసం గబగబా అవుతున్నాయి. ఇద్దరు ప్రొఫెసర్లు కలిసి జూనియర్‌కాలేజీకి తగిన ఉపాధ్యాయవర్గాన్ని సెలెక్టుచేశారు తాత్కాలికంగా.

ప్రారంభోత్సవం మరిచిపోలేనంత బ్రహ్మాండంగా జరిగింది. ప్రార్థన చేసింది మహాలక్ష్మి. పెద్దలందరూ శుభాకాంక్షలు తెలిపారు. దీనిని త్వరలోనే డిగ్రీ కాలేజి చేయదలచినట్టు ప్రారంభోపన్యాసకులు చెప్పారు.

ఒకవైపు బిల్డింగు తయారవుతుంటే మరొకవైపు అడ్మిషన్లు జరుగుతున్నాయి.

కుసుమ కాలేజి మేనేజిమెంటు చేస్తున్నది. మహాలక్ష్మి ఒకచోట కూర్చుని లెక్కలు రాస్తూఉంటుంది.

ఆ కళాశాల డిగ్రీకళాశాల అయిన తరువాత మళ్ళీ స్టాఫ్‌కోసం ఇంటర్వ్యూలు చేస్తున్నారు. సెలక్టుకాని వాళ్ళిద్దరు తిరిగి పోతుంటే ప్రొఫెసరుగారు ఒక మాట న్నారు. ''మీరిద్దరూ ఆఫీసురూమ్‌లోకి వెళ్ళండి. అక్కడ ఇద్దరు లేడీస్‌ఉంటారు. వాళ్ళతో మాట్లాడండి. మళ్ళీ త్వరలో ఇంటర్వ్యూలు జరుగుతాయి'' అని.

వాళ్ళిద్దరూ ఆఫీసు రూమ్‌లోకి వెళ్ళగానే కుర్చీలమీద కూర్చుని మహాలక్ష్మి, కుసుమ మాట్లాడుకుంటున్నారు.

వారిలో ఒకతడు మహాలక్ష్మినే కన్నార్పకుండా చూస్తున్నాడు. ఆమె చెప్పే మాటలుకూడా వినకుండా చూస్తునే ఉన్నాడు.

కుసుమ కనిపెట్టింది. వాళ్ళు వెళ్ళిపోయిన తరువాత ''నిన్ను మింగేటట్టు చూస్తున్నాడు. పెళ్ళిచేసుకుందామనేమో ?'' అంది.

మహాలక్ష్మి ఎప్పుడూ అన్నట్టు "నాకేం పెళ్ళి?" అనలేదు. కుసుమ ఈ మాట ఇంట్లో చెప్పగానే అందరూ అతన్ని చూడటానికి వచ్చారు.

వరలక్ష్మమ్మ ఈ సంగతివిని మహాలక్ష్మి సంగతంతా పూర్తిగా చెప్పమని చెప్పింది, కుసుమకు.

అతడు అంతావిని, ''నేనూ విన్నాను. కాని నాకేమభ్యంతరం లేదు. మేడ మీదికి నేను ఎత్తుకుని వెళ్తాను. ఆమెను కష్టపెట్టను. గాజుబొమ్మలా చూసుకుంటాను. మీరేం భయపడకండి" అన్నాడు సరదాగా మాట్లాడుతూ.

పెళ్ళిమాట వినగానే అమ్మమ్మ తన నగలమూటను బయటికి తీసింది. తల్లి తాళపుచెవులు చేతికిచ్చింది ఇష్టంవచ్చినవి తీసుకొమ్మని. అబ్బాయికీ, అమ్మాయికీ కావలసినవి కొని తెచ్చారు. పెళ్ళి వైభవోపేతంగా జరిగింది. ఆ పెళ్ళంతా సగం కుసుమచేతిమీదుగానూ, సగం పెళ్ళికొడుకు స్నేహితుడి చేతిమీదుగానూ జరిగింది.

మేడమీదంతా ఖాళీచేశారు. సగభాగం మహాలక్ష్మి దంపతులకిచ్చారు.

పెళ్ళి తమచేతులమీదుగా చేసిన పెళ్ళికొడుకు స్నేహితుడికీ కుసుమకూ వరలక్ష్మమ్మ వివాహం తలపెట్టింది. మహాలక్ష్మికి జరిగినట్టుగానే ఈ పెళ్ళికూడా నగానాణ్యేలతో బ్రహ్మాండంగా జరిగింది.

అప్పుడు ప్రొఫెసరు అన్నాడు- "నేను మిమ్మల్ని లెక్చెరర్లుగా సెలక్టు చేయలేదని మీరు విచారపడకుండా, కన్యారత్నాలు సెలక్టు చేసుకున్నారు. ఈ పోస్టులు మీకిష్టమే ననుకుంటాను. ''బిహేవ్ యువర్ సెల్ఫ్స్'' అన్నాడు-

అందరికంటె కన్యారత్నాలు విరగబడి నవ్వారు.

మేడమీది రెండవ భాగం కుసుమకోసం ఎదురుచూస్తున్నది.

కుసుమ నాలుగురోజులు సెలవుపెట్టి తల్లి ఉన్న ఊరికి వెళ్ళి తిన్నగా బ్యాంకికి చేరుకుంది. తనపేరు తల్లిపేరు చెప్పి "ఆమె ఏమయినా ఉత్తరం రాసి పెట్టిందా? నా నగలూ డబ్బు తీసుకోవటానికి వచ్చాను. నాపేరు కుసుమ'' అని మేనేజర్ని అడిగింది. ఆయన ఆమెముఖం బాగా పరిశీలనగాచూసి పద్మావతి గారనే టీచరు ఒక ఉత్తరం రాసిపెట్టారు. ఒక ఫొటో సుమారు 22 ఏళ్ళ అమ్మాయి వస్తే ఇవ్వమని. దానితో మరొక ఉత్తరం జోడించి పిన్నుగుచ్చి ఉన్నది.

మా అమ్మాయి కుసుమ ఏడాదిపిల్ల. దానికోసం ఏభయి తులాల నగలు ఎనభై వేల రూపాయలు మా చెల్లెలి పద్మావతి పేరున అమ్మాయికి మెజారిటీ వచ్చేవరకూ బ్యాంకులో ఉంచుతున్నాను. అమ్మాయి స్వయంగా వచ్చి అడిగితే పద్మావతి సంతకంతో అమ్మాయికి అందజేసి లాకరు చార్జెస్ తీసుకోండి.''

ఇట్లు
చేబోలు వేదవతి

మేనేజరు కుసుమచేత నగలూ డబ్బు ముట్టినట్టు రాయించుకుని ఆమె ఫొటోకు పిన్నుచేసి వాటిని ఆమె యిచ్చేటప్పుడు ఒక ఫొటో తీయించి ఫైల్లో పెట్టుకున్నాడు. లాకర్ చార్జీలు తీసుకుని ఆమెకొక కప్పు కాఫీ ఇప్పించాడు.

అప్పుడు అర్థమైంది కుసుమకు- పద్మావతికీ భర్తకూ ఒకనాడు ఎందుకు

ఘర్షణ జరిగిందో. తను వాళ్ళకూతురుకాదు. తన తల్లిఫోటో చూడాలంటే ఎవరిని అడుగుతుంది ? ఎవరు జవాబు చెప్తారు ?

అయినా ఇప్పుడు విచారించి లాభం ఏమిటి ?

తిరుగు రైలుఎక్కి కుసుమ యింటికి వచ్చింది. వరలక్ష్మమ్మతో అన్ని సంగతులూ చెప్పింది. ఆమె సలహామీద డబ్బు నగలు బ్యాంకులో పెట్టింది.

ఒక సాయంత్రపువేళ కుసుమ మహాలక్ష్మితో ఆలోచించింది. మన కాలేజీ భవనాలకు కాలేజి స్టాఫ్‌కూ అందరికీ మనమీద విశ్వాసం కలగటానికీ వాటి రక్షణకూ ఒక ట్రస్టుబోర్డు ఏర్పరచాలి. మన పెద్దవాళ్ళను మనం గౌరవించాలి. అమ్మమ్మ వెంకాయమ్మగారిని ట్రస్టుబోర్డు అధ్యక్షురాలిగాను, వరలక్ష్మమ్మగారిని ఉపాధ్యక్షురాలిగాను మీటింగు పెట్టి ఎన్నిక చేసుకుందాము. మనిద్దరం మెంబర్లుగా ఉందాము. మనవాళ్ళను ఒకరిని మేనేజరుగాను, ఒకరిని కార్యదర్శిగాను నియమిద్దాము. వాళ్ళను గౌరవించినట్టుగానూ ఉంటుంది. కొంత బాధ్యత ఒప్పగించినట్టుగానూ ఉంటుంది. అమ్మగారికీ, అమ్మమ్మగారికీ చెప్పు. ఒప్పించు. నేను మీటింగు ఏర్పాటుచేస్తాను" అన్నది కుసుమ.

నాకూ మనసులో ముల్లులా గుచ్చుకుంటున్నది. 'వాళ్ళనెలా గౌరవించాలా' అని, మంచి సలహా ఇచ్చారు. ఇప్పుడే ఒప్పిస్తాను వాళ్ళిద్దరిని. మీరు మిగతా ఏర్పాట్లు చెయ్యండి. మీరు ఎకౌంట్సు కూడా చూడాలి" అంది మహాలక్ష్మి.

''ఆ పని మేనేజరుకు ఒప్పగిద్దాం" అంది కుసుమ.

"చూశావా అమ్మాయీ ! వీళ్ళిద్దరూ చిన్నవాళ్ల కాదు. ఊళ్ళను ఏలగలరు. అందరికీ అన్ని బాధ్యతలూ ఒప్పగించి గౌరవించారు. వాళ్ళ భర్తలను గౌరవించి గౌరవం పొందేవారు. సామాన్యులు కాదు''.

ఇద్దరూ నవ్వుకున్నారు మురిపెంతో.

❋❋